

పాఠశాల బస్సు బోల్తా - ముగ్గురు విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి-అనంతపురం

రాప్తాడు మండలం పరిధిలోని ఎర్రగుంట వద్ద ప్రయివేటు పాఠశాల బస్సు బోల్తాపడింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అనంతపురం రూరల్ పరిధిలోని వికలాంగుల కాలనీ సమీపంలో ఉన్న రామకృష్ణ ప్రయివేటు పాఠశాలకు రాప్తాడు మండలం పరిధిలోని గొందిరెడ్డిపల్లి, యర్రగుంట తదితర గ్రామాల నుంచి విద్యార్థులను పాఠశాల బస్సులో తీసుకెళ్తుంటారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత విద్యార్థులతో బస్సు ఆ గ్రామాలకు బయల్దేరింది. విద్యార్థులతో వెళ్తున్న బస్సు యర్రగుంట సమీపంలో బోల్తాపడింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. తక్కిన ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి సమీప గ్రామస్తులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రాప్తాడు పోలీసులు ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.



నార్పల మండలం బండ్లపల్లి సచివాలయ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

పెట్టుబడి సాయం ఇవ్వాలి

ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో వినతి

ప్రజాశక్తి-నార్పల

ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలను వెంటనే ఇవ్వాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామ సచివాలయంలో ఎపి రైతుసంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 ఖరీఫ్, రబీ పంటల బీమా ప్రకటించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. 2023 ఖరీఫ్‌లో అప్పటి ప్రభుత్వం 28 మండలాలు, రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. అయితే కరువు నివారణ చర్యలు మాత్రం చేపట్టలేదన్నారు. కావున నష్టపోయిన రైతులకు పంట బీమా ప్రకటించాలన్నారు. అలాగే ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. ఇకపోతే వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించే ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలన్నారు. ఆయా సమస్యలను వెంటనే ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, రైతుసంఘం నాయకులు లక్ష్మీనారాయణ, వెంకటనారాయణరెడ్డి, శివారెడ్డి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయంతోపాటు 2023 ఖరీఫ్, రబీ పంటలకు బీమా ప్రకటించాలని, కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో మండలంలోని అన్ని సచివాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌సూరి, రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకట్‌చౌదరి, అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వ్యకాసం మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, ఎర్రినాగప్ప, కెవిపిఎస్ మండల కార్యదర్శి నాగభూషణం, రైతులు పెద్దయ్య, పుల్లయ్య, గురుస్వామి, నాగార్జున, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు ఇవ్వాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం సిపిఎం ఆధ్వర్యంలో మండల వ్యవసాయ శాఖ కార్యాలయం, ఆయా సచివాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, ముత్యాలు, బాబా ఫక్రుద్దీన్, శివకుమార్, మాబాషా, విజయ్, శ్రీరాములు, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : 2023 ఖరీఫ్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు బీమా ప్రకటించాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో సచివాలయ కార్యదర్శికి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం గత ప్రభుత్వంలో నిలిచిపోయిన ఉపాధి హామీ బిల్లులను చెల్లించాలని, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్సలర్ల నియామకం

◆ పాత విసిల రాజీనామాలు ఆమోదం ◆ జెఎన్‌టియుకు సుదర్శన్ రావు.. ఎస్‌కెయుకు అనిత

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జెఎన్‌టియు, ఎస్‌కెయు వైస్ ఛాన్సలర్ల రాజీనామాలు ఆమోదం పొందాయి. ఈ స్థానంలో కొత్తగా ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ల నియామకం జరిగింది. అనంతపురం జెఎన్‌టియుకి సుదర్శన్‌రావును నియమించగా, ఎస్‌కెయుకు అనితను నియమిస్తూ గురువారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు మునుపు జెఎన్‌టియుకు ఉన్న శ్రీనివాసరావు, ఎస్‌కెయు విసి హుస్సేన్‌రెడ్డిలు నెలక్రితం రాజీనామాలు చేశారు. ఈ ఏడాది జనవరి నెలలోనే వీరి నియమకాలు జరిగాయి. మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. వచ్చిన వెంటనే ఆ ప్రభుత్వ హయాంలో



సుదర్శన రావు,



అనిత

జరిగిన నియామకం అయిన వారందరూ రాజీనామాలు చేశారు. అందులో భాగంగానే ఎస్‌కెయు, జెఎన్‌టియు విసిలు రాజీనామా చేశారు. అప్పటి నుంచి తాత్కాలికంగా లుక్ ఆఫ్టర్ కింద నియమించారు. వారి రాజీనామాలు ఆమోదం జరగలేదు. ఇప్పుడు వాటిని ఆమోదించి, కొత్తగా ఇన్‌ఛార్జిలను నియమించారు. సుదర్శన్‌రావు అనంతపురం జెఎన్‌టియులో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. ఇక ఎస్‌కెయులో మేనేమెంట్ స్టడీస్ విభాగాధిపతిగా ఉన్న అనితను ఇన్‌ఛార్జి విసిగా నియమించారు. ఈ నియామకాలతో తాత్కాలికంగా పరిపాలనకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వీలుంటుంది. ప్రస్తుతం రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ లేక ఆర్థికపరమైన అంశాలన్నీ ఆగిపోయి ఉన్నాయి. ప్రధానంగా సిబ్బందికి జీతాలు కూడా అందలేదు. ఇప్పుడు ఇన్‌ఛార్జులు రావడంతో సాధారణ పరిపాలనాపరమైన పనులకు ఆటంకం లేకుండా జరిగేందుకు వీలుంటుంది.

రెగ్యులర్ నియామకాలెప్పుడో ?

ప్రస్తుతం నియమితులైన వైస్ ఛాన్సలర్లు ఇద్దరూ ఇన్‌ఛార్జీలుగానే ఉంటారు. రెగ్యులర్ వైస్‌ఛాన్సలర్లను నియమించాలంటే సెర్చ్ కమిటీని నియమించాల్సి ఉంటుంది. సెర్చ్ కమిటీ నియామకం జరిగాక ఆశవహులు దరఖాస్తు చేసుకుంటారు. అందులో అర్హులైన వారిలో ముగ్గురిని గుర్తించి జాబితాను గవర్నర్‌కు పంపుతారు. అందులో ఒకరిని గవర్నర్ నియమిస్తారు. ఈ ప్రక్రియ పూర్తవ్వాలంటే సెర్చ్ కమిటీ నియామకం అయిన తరువాత మూడు మాసాల సమయం పడుతుంది. ప్రభుత్వం ఈ కమిటీని ఎప్పుడు నియమించి రెగ్యులర్ వైస్‌ఛాన్సలర్ల నియామకం పూర్తి చేస్తుందో చూడాల్సి ఉంది. ఇప్పటికే కొందరు ప్రొఫెసర్లు రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసుకుంటున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

◆ ఎస్పీ కెవి.మురళీకృష్ణ ◆ జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామని నూతన ఎస్పీ కెవి.మురళీకృష్ణ తెలిపారు. అనంతపురం జిల్లా నూతన ఎస్పీగా మురళీకృష్ణ గురువారం నాడు జిల్లా పోలీసు కార్యాలయంలోని తన ఛాంబర్లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీసు సేవలను ప్రజలకు చేరువ చేస్తామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికపై ప్రత్యేక చొరవ చూపి ప్రజలకు మరింత సేవలు అందేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. గంజాయి నియంత్రణపై గట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి రవాణాదారులు, విక్రేతలు, వినియోగదారులను గుర్తించి చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.



నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న కెవి.మురళీకృష్ణ

నిష్పక్షపాతంగా, చట్టపరంగా వ్యవహరిస్తామని, ఎవరైనా విఘాతం కల్గిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నియంత్రణపై దృష్టి సారిస్తామని, క్షేత్రస్థాయిలో మహిళా సమస్యలను గుర్తించి తగు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. హోంగార్డుల నుంచి పోలీసు సిబ్బంది, అధికారులు, వారి కుటుంబాల సంక్షేమంపైనా దృష్టి సారిస్తామన్నారు. బాధ్యతలు చేపట్టిన నూతన ఎస్పీని అదనపు ఎస్పీలు ఆర్.విజయ భాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, డీఎస్పీలు టివివి.ప్రతాప్, బి.శ్రీనివాసులు, శివభాస్కర్ రెడ్డి, జనార్ధన్ నాయుడు, బివి.శివారెడ్డి, ఎఆర్ డీఎస్పీ మునిరాజ, జిల్లా పోలీసు కార్యాలయం ఎఇ శంకర్‌తో పాటు సిఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

డిఐజి, కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణ అనంతపురం రేంజ్ డిఐజి డాక్టర్ షిమోషి, కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్‌లను వారి కార్యాలయాల్లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి వారితో కాసేపు మాట్లాడారు.

వైసిపి అవినీతిపై ఎమ్మెల్యే ఫిర్యాదు

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి హయాంలో అనంతపురం నియోజకవర్గంలో జరిగిన అవినీతి అక్రమాలపై ఎమ్మెల్యే ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గురువారం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి పాలనలో జరిగిన అవినీతి లెక్కలన్నీ బయటకు తీస్తామన్నారు. అనంతపురం మున్సిపాల్టీ పేరు చెబితే అవినీతి అనే పదం ముందుగా వినిపిస్తోందన్నారు. ఈమచ్చ తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో ఎన్టీఆర్ మార్గ్‌లో వాహనాల రాకపోకలు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌యాదవ్, టిడిపి బిసి సంఘం రాష్ట్ర నాయకులు జోగి రాజేంద్ర, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి



ర్యాలీలో పాల్గొన్న జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి శ్రీహరి

రహదారి నిబంధనలతో ప్రమాదాల నివారణ

జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి శ్రీహరి

ప్రజాశక్తి-గుత్తి

రహదారి నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి, మండల న్యాయ సేవా సమితి అధ్యక్షులు శ్రీహరి సూచించారు. మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో ఉన్న మండల న్యాయ సేవా సమితి కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీ కూడలి వరకూ కొనసాగింది. అక్కడ గుడ్ షెఫర్డ్ విద్యార్థులచే మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడిజే శ్రీహరి మాట్లాడుతూ మోటార్ వాహనం చట్టం ప్రకారం వాహనదారులు జీవిత బీమా కలిగి ఉండాలన్నారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ బి.నబిరసూల్, న్యాయస్థానాల అధికారులు నరసింహారెడ్డి, నీలావతి, మునెమ్మ, గుడ్ షెఫర్డ్ పాఠశాల కరస్పాండెంట్ విద్యాసాగర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంకె.రామశర్మ, సీనియర్ న్యాయవాదులు మనోహర్ బాబు, మహమ్మద్ రసూల్, ఫక్రు భాష, నూర్ మహమ్మద్, వీసీ.గంగాధర్ కుమార్,పి.శ్రీనివాసులు, ఎన్. చంద్రశేఖర్, కోర్టు టైపిస్ట్ ఎస్.సాదిక్ వలి, ప్యారా లీగర్ వాలంటరీ నరసింహనాయుడు, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని యాదవ సంఘం, సంతాన వేణుగోపాలస్వామి ఆలయానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గురువారం సాయంత్రం ఆలయ ఆవరణలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా రామ్మూర్తి, తిప్పేస్వామి, రామాంజనేయులు, అధ్యక్షులుగా బంగి ఉమాశంకర్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ రామస్వామి, భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా కె.లక్ష్మీనారాయణ, రాజేష్, కోశాధికారిగా నాగరాజు, ఉపకోశాధికారిగా లోకేష్, ప్రచార కార్యదర్శులుగా ఆవుల మనోహర్, అగ్రహారం కిరణ్, తదితరులు ఎన్నికయ్యారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం

హెల్మెట్ వినియోగంపై ద్విచక్ర వాహనదారులకు గురువారం పట్టణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల లీగల్ కమిటీ అధ్యక్షులు శోభారాణి ఆధ్వర్యంలో స్థానిక బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పారా లీగల్ వాలంటీర్లు, పోలీసులు పట్టణంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. పట్టణంలోని లక్ష్మీ బజార్, రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, తదితర ప్రాంతాలోల ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు లోకానంద, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ బాలు, మురళి, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఢిల్లీరావును అగ్రికల్చర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. వ్యవసాయ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను నూతన డైరెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర అధ్యక్షులు పివి.సాయికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రవికుమార్, రాష్ట్ర కోశాధికారి శ్యాంసుందర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు డిఎస్ఎన్.శ్రీనివాస్, శివజ్యోతి, ఉపాధ్యక్షులు పాపారావు, ప్రభాకర్ రమేష్ , కోటేశ్వరరావు, రాకేష్, దుర్గారావు, అమీర్‌బాషా, శ్రీనివాస్ రామ్మోహన్ పాల్గొన్నారు.



ఢిల్లీరావుతో అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ కార్యవర్గం

కామ్రేడ్ వీరన్న పోరాటాలు కొనసాగిద్దాం

కిష్టపాడులో నివాళి



వీరన్న స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న సిపిఎం, కెవిపిఎస్, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

కుల,మత దురహంకార దాడులకు వ్యతిరేకంగా పోరాడిన కెవిపిఎస్ నాయకుడు కామ్రేడ్ వీరన్న పోరాటాలను కొనసాగిద్దామని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. వీరన్న ఆరవ వర్ధంతి సందర్భంగా పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామంలోని ఆయన స్తూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, వీరన్న కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వీరన్న సాధారణ పేద దళిత కుటుంబంలో పుట్టి పేదలు, సామాజిక తరగతుల అభ్యున్నతి కోసం పోరాటం సాగించారన్నారు. డివైఎఫ్ఐ, కెవిపిఎస్, సిపిఎం, సిఐటియులో పని చేశారన్నారు. ఆలమూరు, సలకం చెరువు, ఎర్రగుడి, క్రిష్టిపాడు, అయ్యవారిపల్లి తదితర గ్రామాల్లో జరిగిన అనేక కుల వివక్షత దురాహంకార దాడులకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను నిర్వహించారన్నారు. ఇటీవల మత ఉన్మాదాన్ని పెంచే పద్ధతుల్లో పాలన సాగుతోందన్నారు. ఇలాంటి వాటిని ఎదిరించేలా వీరన్న పోరాటాల స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుత్తి సిపిఎం మండల కార్యదర్శి యు.మల్లికార్జున, వీరన్న భార్య అరుణ కుమారి, ఐద్వా జిల్లా నాయకురాలు రామాంజనమ్మ, రేవతి, లక్ష్మి, వీరన్న బంధువులు సుంకన్న, శ్రీరాములు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గుత్తి : కామ్రేడ్ జి.వీరన్న ఆశయాలను కొనసాగిస్తామని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య పిలుపునిచ్చారు. వీరన్న వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని జెడ్.వీరారెడ్డి కాలనీలో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ జి.వీరన్న సాధారణ పేద దళిత కుటుంబంలో పుట్టి అనేక ప్రజా పోరాటాలను కొనసాగించారన్నారు. గ్రామాల్లో జరిగిన కుల వివక్షత దురాహంకార దాడులకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేశారన్నారు. వీరన్న ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వి.నిర్మల, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు కవిత, వ్యకాసం నాయకురాలు వెంకటలక్ష్మి, మల్లికాదేవి, శ్యామల, కుళ్లాయప్ప, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

103 శాఖలు రోజువారి నివేదికలు అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా అభివృద్ధిలో భాగంగా అన్ని శాఖల్లోనూ మంచి ఫలితాలే లక్ష్యంగా సంబంధిత అధికారులు పని చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలో మంచి ఫలితాలు సాధించడమే లక్ష్యంగా జిల్లాలో ఉన్న దాదాపు 103 శాఖల పరిధిలో రోజువారి నివేదికలు అందించేవిధంగా కలెక్టర్ చర్యలు చేపట్టారు. ఆయా శాఖల పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి, ఇతర కార్యక్రమాలు, తదితర అంశాలపై రోజు మానిటరింగ్ చేసేలా దృష్టి సారించారు. ఈ కార్యక్రమం అమలుపై గురువారం నాడు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఆయా శాఖల పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఇతర కార్యక్రమాలు, తదితర అంశాలపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న దాదాపు 103 శాఖలు రోజువారి నివేదికలు అందించాలన్నారు. రోజువారీగా రెవెన్యూ సర్వీసెస్, డ్వామా ఎన్‌ఆర్‌ఈజిఎస్ పనులు, పలు శాఖల పరిధిలో కొన్ని కార్యక్రమాలను సమీక్ష చేయనున్నట్లు చెప్పారు. అన్ని శాఖల పరిధిలోనూ రోజూ పరిశీలన చేయడం ద్వారా తాజా వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. రోజువారి నివేదికలు అందించడం ద్వారా జిల్లా పనితీరు మరింత మెరుగుపడుతుందన్నారు. ఉన్నతాధికారులు అడిగినా అడగకపోయినా జరగాల్సిన పని జరగాలని, అందరూ అనుకున్నంత వేగంగా పనిచేస్తే జిల్లాలో అభివద్ధి పరుగులు పెడుతుందన్నారు. రోజువారి నివేదికలను 24 గంటల్లోగా అన్ని శాఖలు అందించాలన్నారు. రోజువారి నివేదికలు అందించడం ద్వారా అధికారులు మరోచోటకి మారినా ఎలాంటి ఇబ్బందీ ఉండదన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, డిపిఒ ప్రభాకర్ రావుతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌వినోద్‌కుమార్

వైభవంగా పాండురంగస్వామి రథోత్సవం



పాండురంగస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఆషాడ శుద్ధ ద్వాదశి పురస్కరించుకొని గురువారం పట్టణంలోని బళ్లారి రోడ్డులో వెలసిన పాండురంగస్వామి ఆలయం వద్ద రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలోని స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథంలో కొలువుదీర్చి పట్టణ ప్రధాన వీధుల గుండా కోటలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం మీదుగా తిరిగి పాండురంగ స్వామి ఆలయం వరకూ రథోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాలకు ఆలయ కమిటీ అధ్యక్షులు కెబి.మురళీ సారథ్యం వహించగా, ఎపి స్వకులశాలి సమాజ అధ్యక్షులు కాంబ్లే నగేష్, తెలం గాణ రాష్ట్ర సమాజ అధ్యక్షులు రామలింగేశ్వర్ కాంబ్లే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఓబుళాచారి రోడ్డు వద్ద ఉన్న రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయంలో కూడా ఏకాదశి పురస్కరించుకుని ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

గూగూడు ఉత్సవాల్లో కార్మికుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికుల సేవలు అభినందనీయమని సర్పంచి రమణకుమారి, శివయ్య దంపతులు కొనియాడారు. కార్మికులకు సర్పంచి దంపతులు గురువారం విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచి రమణకుమారి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల కంటే ముందుగానే గూగూడుకు వచ్చి ఏర్పాట్లు చేసిన కార్మికుల సేవలు మరువలేనివన్నారు. కార్మికులు సమయానికి తినకపోయినా పనులు చేశారన్నారు. వారి సేవలను గుర్తించి బుధవారం కుళ్లాయిస్వామి జలధి కార్యక్రమం ముగియడంతో గురువారం మాంసాహార విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు అన్నదానం చేస్తున్న సర్పంచి దంపతులు

నార్పల శ్మశానవాటికలో విద్యుత్‌దీపాలు ఏర్పాటు

నార్పల : మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ పక్కన ఉన్న హిందూ శ్మశాన వాటికలో అధికారులు విద్యుల్ లైట్లు ఏర్పాటు చేశారు. గత కొన్నేళ్లుగా శ్మశానంలో లైట్లు లేకపోవడంతో చీకటిలో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. విషయాన్ని అంబేద్కర్ కాలనీవాసులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే శ్మశాన వాటికలో లైట్లు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ రాముడు, పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశించిన 24 గంటలలోపు శ్మశాన వాటికలో లైట్లు ఏర్పాటు చేశారు.



రక్తదానం చేస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

'రైపర్'లో రక్తదాన శిబిరం

అనంతపురం : నగర సమీపంలో ఉన్న రాఘవేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (రైపర్)లో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.పద్మనాభరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఉమామహేశ్వర్‌రావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వినోద్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.నాగభూషణ్, యు.వీరేంద్ర, మహిళా సాధికారత సెల్ కోఆర్డినేటర్ త్రివేణి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ కె.భారతి, సెక్రటరీ మోహన్‌కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మోతాదులోనే ఎరువులు వాడాలి

బుక్కరాయసముద్రం : రైతులు తగు మోతాదులో ఎరువులను వాడితే అధిక దిగుబడులను సాధించవచ్చని వ్యవసాయ అధికారిణి శైలజా సూచించారు. గురువారం మండలంలోని కెకె.అగ్రహారం రైతు సేవాకేంద్రంలో పరిధిలో రైతులు సాగు చేసిన దానిమ్మ, అరటి, ద్రాక్ష, టమోటా పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దానిమ్మ రైతులు ఎప్పటికప్పుడు ఉద్యానశాఖ అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎ కావ్య, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షసపాలన

వజ్రకరూరు : రాష్ట్రంలో టిడిపి అధికారం చేపట్టినప్పటి నుంచి రాక్షసపాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్పపై దాడి అమానుషమన్నారు. అలాగే వినుకొండలో యువజన నాయకుడిని నడిరోడ్డుపై నరికి చంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో శాంతి, భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి దాడులను నియంత్రించాలని కోరారు.

కళాశాలకు చేరిన ఇంటర్ మార్కుల మెమోలు

వజ్రకరూరు : 2023-2024 విద్యా సంవత్సరం మార్చి, మేనెల్లో జరిగిన పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఒకేషనల్ విద్యార్థుల ఒరిజినల్ మార్కుల జాబితాలు బోర్డు నుంచి కళాశాలకు చేరినట్లు ప్రిన్సిపాల్ ఎస్.మమత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్థికసాయం

బెలుగుప్ప : వాలీబాల్ జాతీయ జట్టుకు ఎంపికైన మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన విద్యార్థి సంతోష్‌కు ఉపాధ్యాయులు గురువారం ఆర్థికసాయం అందజేశారు. బ్రాహ్మణపల్లిలో పని చేసే ఉపాధ్యాయుడు లక్ష్మణ చొరవతో మండల విద్యాధికారులు మల్లారెడ్డి, హరికృష్ణ, బెలుగుప్ప ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటప్రసాద్, బాలాజీ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది సిఆర్‌ఎంటి ద్వారా సేకరించిన రూ.21,500 నగదును విద్యార్థికి అందజేశారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

'చిన్నతనంలోనే మద్యపానం అలవాటు'

ప్రాణాల మీదకు తెచ్చుకున్న విద్యార్థి-కిమ్స్ సవీరా ఆసుపత్రిలో సంక్లిష్టమైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి-అనంతపురం

పదో తరగతి చదివే సమయం నుంచే ఉన్న మద్యపానం అలవాటు.. ఓ యువకుడి ప్రాణాల మీదకు తీసుకొచ్చింది. 16 ఏళ్ల వయసు నుంచి మద్యపానం అలవాటైపోయిన ఓ యువకుడికి.. దాని కారణంగా పాంక్రియాస్ (క్లోమం) బాగా పాడైపోయి, కుళ్లిపోయిన స్థితికి చేరుకోవడంతో ప్రాణాపాయం ఏర్పడింది. ఇన్ఫెక్షన్ తీవ్రస్థాయిలో వ్యాపించడంతో శస్త్రచికిత్స చేసినా బతికే అవకాశాలు దాదాపు లేవనే బెంగళూరులోని పలు ఆస్పత్రుల వైద్యులు అసలు కేసు తీసుకునేందుకే ఇష్టపడలేదు. అలాంటి కేసులో అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యులు అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్స చేయడమే కాక.. రోగి ప్రాణాలను విజయవంతంగా కాపాడారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆసుపత్రి కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ఎన్.మహ్మద్ షాహిద్ తెలిపారు. హిందూపురానికి చెందిన 26 ఏళ్ల లోకేష్‌కు పదోతరగతి నుంచే మద్యపానం అలవాటు ఉంది. దీంతో లోకేష్‌కు పాంక్రియాస్ చుట్టూ నీరు చేరి, ఒక గోడలా తయారైపోవడమే కాక.. బాగా చీముపట్టి విపరీతమైన ఇన్ఫెక్షన్ (నెక్రోసిస్)కు దారితీసింది. బీఎస్సీ ఎనస్థీషియా టెక్నాలజీ చదువుతున్నాడు. సమస్య వచ్చిన మొదట్లో ఇక్కడ చూపించుకున్నప్పుడు మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టుకు చూపించాడు. ఆయన కొన్ని మందులు ఇచ్చి, శస్త్రచికిత్స అవసరం అవుతుందని చెప్పారు. దీంతో రోగి, అతడి బంధువులు బెంగళూరు తీసుకెళ్లారు. అక్కడ మూడు నాలుగు పెద్దపెద్ద ఆస్పత్రులకు తిరిగారు. ఇలాంటి కేసులో శస్త్రచికిత్స చేయకపోతే బతికే అవకాశాలు దాదాపు ఉండవు. ఒకవేళ చేసినా, 60, 70 శాతం మంది చనిపోతారు. బతికేవారిలో కూడా జీవితాంతం ఏవో ఒక సమస్యలు వస్తూనే ఉంటాయి. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితి ఉండటంతో బెంగళూరు ఆస్పత్రుల్లో వైద్యులెవరూ ఈ కేసు తీసుకోవడానికి ఇష్టపడలేదు. ఇన్ఫెక్షన్ తీవ్రస్థాయిలో ఉండటంతో పాటు గుండె రేటు కూడా గణనీయంగా పెరిగిపోయింది. రక్తపోటు పడిపోయిందన్నారు. ఈనేపథ్యంలో క్లోమం పూర్తిగా పాడైపోవడంతో దాన్ని తొలగించక తప్పలేదన్నారు. ఇన్ఫెక్షన్ పేగులకు కూడా విస్తరించడంతో ముందు జాగ్రత్తగా స్టోమా చేశామన్నారు. దీన్ని మరో రెండు, మూడు నెలల తర్వాత మళ్లీ లోపల పెట్టేస్తామన్నారు. ఈ శస్త్రచికిత్స తర్వాత లోకేష్ పూర్తిగా కోలుకున్నాడు. అయితే, పాంక్రియాస్‌ను తొలగించడం వల్ల భవిష్యత్తులో అతడికి కచ్చితంగా మధుమేహం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇన్ఫెక్షన్లు వ్యాపించే ప్రమాదం కూడా ఉంటుందన్నారు. మధుమేహ నియంత్రణకు టాబ్లెట్లు గానీ, ఇన్సులిన్ గానీ వాడాల్సి ఉంటుందన్నారు. మద్యపానానికి పూర్తిగా దూరం కావాలని సూచించారు. ఈ శస్త్ర చికిత్సకు హైదరాబాద్, బెంగళూరు లాంటి పెద్ద నగరాల్లో ఇలాంటి శస్త్రచికిత్సలకు దాదాపు రూ.10 లక్షల వరకూ ఖర్చు అవుతుండగా కిమ్స్ సవీరా ఆస్పత్రిలో కేవలం రూ.2లక్షలకే చేశామని వివరించారు. ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడినందుకు డాక్టర్ మహ్మద్ షాహిద్‌కు, కిమ్స్ సవీరా ఆస్పత్రి యాజమాన్యానికి లోకేష్, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



చికిత్స వివరాలు వెల్లడిస్తున్న సవీరా ఆసుపత్రి వైద్యులు

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే దగ్గుపాటికి ఎస్ఎఫ్ఐ నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పెండింగ్‌లో ఉన్న హాస్టళ్ల మెస్, కాస్మొటిక్ ఛార్జీలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం అనంతపురంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను, ఎస్ఎఫ్ఐ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువుకు నిలయంగా ఉన్న అనంతపురం జిల్లాలో గ్రామీణ ప్రాంతాల నుంచి అనేవమంది విద్యార్థులు సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో హాస్టళ్లకు మెస్, కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీసీ సంక్షేమ హాస్టళ్లలో దాదాపు 7నెలల నుంచి కాస్మొటిక్, మెస్‌ఛార్జీలు ప్రీ మెట్రిక్ రూ.2,03,08,446, పోస్ట్‌మెట్రిక్ రూ.1,00,11,735 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో విద్యార్థులు అర్ధాకలితో విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పెండింగ్ ఛార్జీలతోపాటు పెరిగిన ధరలు అనుకూలంగా మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలని కోరారు. అలాగే హాస్టళ్లలో భవనాలు, ప్రహరీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు రజిత, పట్టణ కార్యదర్శి శివ, నాయకులు చందు, గణేష్, రాజేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడొద్దు : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడకుండా చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సూచించారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గురువారం డిపిఒలోని తన ఛాంబర్‌లో జిల్లాలోని డీఎస్పీలు, అదనపు ఎస్పీలతో సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలోని తాజా పరిస్థితులను సమీక్షించారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల్లో భరోసా కల్గించడంలో దోహదం చేసే బేసిక్ పోలీసింగ్‌ను మెరుగు పరుచుకోవాలన్నారు. బీట్లు రీ ఆర్గనైజ్ చేయాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా వేయాలన్నారు. ప్రతీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ తప్పకుండా తరుచూ గ్రామాల సందర్శన చేయాలన్నారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న తాజా పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి సమస్యలను మొగ్గ దశలో తుంచేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలకు చట్ట పరిధిలో పరిష్కారం చూపాలన్నారు. జిల్లాలో మెరుగైన పోలీసింగ్ కు ఎలాంటి చర్యలు చేపట్టాలో దిశానిర్దేశం చేశారు. ఈసమావేశంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయ భాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, డీఎస్పీలు టివివి ప్రతాప్, జనార్ధన్‌నాయుడు, బి.శ్రీనివాసులు, శివ భాస్కర్ రెడ్డి, బి.వి.శివారెడ్డి, మునిరాజ (ఏఆర్), ఎస్బీ సిఐ ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

'నారాయణపురం'ను కార్పొరేషన్‌లో విలీనం చేస్తాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

నగర సమీపంలో ఉన్న నారాయణపురం పంచాయతీని అనంతపురం కార్పొరేషన్‌లో విలీనం చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు. గురువారం నారాయణపురం పంచాయతీలోని ఎస్ఆర్ నగర్‌లో ఏర్పాటు చేసిన పీర్లమకాన్‌ను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణపురం చరిత్రలో ఎప్పుడూ లేనంతగా ఈసారీ తనకు మెజార్టీ ఇచ్చారన్నారు. మీరుణం ఎప్పటికీ తీర్చుకోలేనన్నారు. ఖచ్చితంగా ఈ పంచాయతీలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. ముఖ్యంగా నారాయణపురాన్ని అనంతపురం కార్పొరేషన్ పరిధిలోకి తీసుకురావాలని అనుకుంటున్నామన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నారాయణపురం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆదినారాయణ, రాయల్ మురళి, జోగి రాజేంద్ర, సుధాకర్‌యాదవ్, దండు శ్రీనివాసులు, ఈశ్వర్, రమణ, లాల్‌స్వామి, బళ్లారి అనిల్, బళ్లారి సుధాకర్, రాయచూరు వెంకటేష్, మునీంద్ర, వెంకటరాముడు, జయప్రకాష్‌యాదవ్, వడ్డే హరికుమార్, వెంకటలక్ష్మి, వరాలమ్మ, రామచంద్ర, తిరుపతయ్య, ఈశ్వరయ్య, రమణ, దండు జగన్, గణేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.



ఎంపీ, ఎమ్మెల్యేను సన్మానించిన ముస్లిములు

'తల్లికి వందనం'ను ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపజేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకురానున్న 'తల్లికి వందనం' పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకే అమలు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు వర్తింపజేస్తే గ్రామాల్లో విద్యార్థులు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు తరలిపోతారన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలు మూతబడే అవకాశం ఉందన్నారు. అలాగే గత ప్రభుత్వం అప్రజాస్వామిక పద్ధతిలో తీసుకొచ్చిన జీఓ.117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సిరాజుద్దీన్, ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు రమణ, సర్దార్‌వలి, ఆడిట్ కమిటీ కన్వీనర్ కోటగిరి వన్నప్ప, జిల్లా నాయకులు కె.పాతిరెడ్డి, ప్రసాద్, హనుమంతు, ఈశ్వరయ్య, యల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

వికె ఆదినారాయణ ఆశయాలను కొనసాగిద్దాం

పామిడి : కామ్రేడ్ వికె.ఆదినారాయణ ఆశయాలను కొనసాగిద్దామని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. వికె.ఆదినారాయణ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని పోలీస్ కాంప్లెక్స్ దగ్గర సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ వీకే.ఆదినారాయణ పేదల పక్షాన అనేక ప్రజా పోరాటాలు చేశారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిమిరెడ్డి, రహీం, మల్లేష్, నాగరాజు, గజ్జల దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : సిపిఐ మాజీ ఎమ్మెల్యే వీకే.ఆదినారాయణరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని గురువారం గుత్తి సిపిఐ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల, పట్టణ కార్యదర్శులు జి.రామదాసు, రాజుయాదవ్, నాయకులు రమేష్, నరసింహయ్య, నజీర్, డానియల్, షఫీ, మహమ్మద, తదితరులు పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లు

పెద్దపప్పూరు : మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని ముచ్చుకోట, నామనాంకుపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో కొలువైన పీర్లు గురువారం జలధికి తరలివెళ్లాయి. ముందుగా తెల్లవారుజామున మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం భారీ ఊరేగింపుతో జలదికి వెళ్లాయి. ఎస్ఐ గౌస్‌బాషా భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

నారాయణప్పకు నివాళి

అనంతపురం : సైన్యంలో డాక్టర్‌గా కెప్టెన్ ర్యాంకులో పని చేసి రిటైర్డ్ అయిన డాక్టర్ నారాయణప్ప మృతిచెందడంతో మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు కెప్టెన్ దూదేకుల షేకన్న గురువారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, కోశాధికారి తిమ్మారెడ్డి, మణికుమార్, హుస్సేన్‌పీరా, బిఎ హుస్సేన్, నరసింహులు, కమ్మరి హరినాథ్, పెంచలయ్య, ఖాజా మొయిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

సరసమైన ధరలకు కందిపప్పు, బియ్యం



కిరాణా సరుకులు అందజేస్తున్న అధికారులు

పుట్లూరు : మండల కేంద్రంలోని శ్రీరామ సూపర్ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.160, కిలో బియ్యం రూ.48 సరసమైన ధరలకు విక్రయిస్తున్నట్లు తహశీల్దార్ మల్లికార్జునస్వామి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సూపర్ మార్కెట్ దగ్గరకు వెళ్లి నిత్యావసర సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరసమైన ధరలకు కందిపప్పు, బియ్యాన్ని పంపిణీ చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ క్రిష్టప్ప, వీఆర్వో వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

డిప్యూటీ సీఎం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా చురుగ్గా సభ్యత్వాల నమోదు చేపట్టినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ తెలిపారు. గురువారం అనంతపురం జనసేన పార్టీ కార్యాలయంలో సభ్యత్వాల నమోదును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీకి ప్రజల్లో ఎంతో ఆదరణ ఉందన్నారు. అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలు సిద్ధాంతాలకు ఆకర్షితులై పెద్దసంఖ్యలో యువత పార్టీలో చేరే అవకాశం ఉందన్నారు. ఈనేపథ్యంలో పార్టీ విధానాలను క్షేత్రస్థాయిలో వివరించి పెద్దసంఖ్యలో సభ్యత్వాలను నమోదు చేయాలన్నారు. 18 నుండి 28వ తేదీ వరకూ జిల్లావ్యాప్తంగా సభ్యత్వ నమోదు డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు భవాని రవికుమార్, పొదిలి బాబురావు, పెండ్యాల శ్రీలత, జయరామిరెడ్డి, అంకే ఈశ్వరయ్య, మురళీకృష్ణ, లక్ష్మీపతి, కుమ్మర నాగేంద్ర, రాపా ధనంజయ్, సంజీవరాయుడు, కిరణ్‌కుమార్, జయమ్మ, ఆవుకు విజయకుమార్, ముప్పూరి కృష్ణ, గ్రంధి దివాకర్, మేదర వెంకటేష్, భాస్కర్, కమటం వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు పత్రాలను చూపుతున్న జనసేన పార్టీ నాయకులు

పలువురు జనసేనలోకి చేరిక

స్థానిక సప్తగిరి సర్కిల్ జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు రాజేష్, నరసయ్య ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం, కంబదూరు మండలానికి చెందిన వైసిపి నాయకులు, మద్దతుదారులు 30మందికిపైగా జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వీరికి టిసి వరుణ్, కాయగూరల లక్ష్మీపతి కండువాలు కప్పి ఆహ్వానించారు.

బుక్కరాయసముద్రం : ప్రతిఒక్కరితో సభ్యత్వ నమోదు చేయించి పార్టీని బలోపేతం చేయనున్నట్లు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాకే మురళీకృష్ణ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈనెల 28వ తేదీ వరకూ సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని జనసైనికులు, వీర మహిళలు, పవన్‌కళ్యాణ్ అభిమానులు తప్పకుండా పాల్గొని సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి చొప్ప చంద్రశేఖర్, మండల అధ్యక్షులు జి.ఎర్రిస్వామి, నియోజకవర్గ నాయకులు సాకే మునీంద్ర, నాయకులు అరటి తాహిర్, విశ్వనాథ్, అనిల్, కామేష్, వంశీ, కిషోర్, ధనంజయ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు : ఉరవకొండ నియోజకవర్గ జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్రియాశీలక సభ్యత్వ నమోదును ఇన్‌ఛార్జి గౌతమ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రశేఖర్, కేశవ, గోపాల్, సుధీర్, నగేష్, దేవేంద్ర, రాజేష్, హరిశంకర్ నాయక్, రమేష్, మల్లేష్‌గౌడ్ , మణికుమార్, ధనుంజయ, చిరు, నరేంద్ర, నీలకంఠ, భీమేష్, బోగేష్, రమేష్, బిమేష్, శివ, శేఖర్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో మొక్కలు నాటుతున్న అధికారులు

మొక్కలను నాటి సంరక్షించాలి

ప్రజాశక్తి-గుత్తి

మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అటవీ సెక్షన్ అధికారి వి.నారపరెడ్డి, అటవీ బీట్ అధికారి పి.రమేష్‌బాబు పిలుపునిచ్చారు. వనమహోత్సవం, అమ్మకు ఒకమొక్క కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణ శివారులోని అనంతపురం రోడ్డు పక్కన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే ప్రాణవాయువు దక్కుతుందన్నారు. కావున ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అటవీ సహాయ బీట్ అధికారి తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

అలాగే పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో అటవీ డిప్యూటీ రేంజ్ అధికారిణి ఫ్లోరెన్స్ దీప మొక్కలను నాటారు. తల్లి పేరు మీద ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా వసతి గృహ ఆవరణలో ఆమె విద్యార్థినులతో కలిసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల : మండల పరిధిలోని సోదనపల్లి ఎస్సీ కాలనీలోని ఎంపిపి పాఠశాల పేట ప్రసాద్‌రెడ్డి ఆవరణంలో టిడిపి సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అట్టే రామాంజనేయులు, పేట శివారెడ్డి, పేట ప్రసాద్‌రెడ్డి, ఏకల ఆదినారాయణ, శ్రీనివాసులు, శంకర, ఈడిగ లక్ష్మయ్య, పాఠశాల కమిటీ ఛైర్మన్ బంగి ఆదినారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు ముబీన, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తహశీల్దార్ హరినాథ్‌రావు, ఎంపిడిఒ సుబ్బరాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం టిడిపి నాయకులతో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి మాధవరెడ్డి, ఎస్ఐ శివ, టిడిపి నాయకులు ప్రసాద్, రాధాకృష్ణ, మల్లికార్జున, ఎఒ పృథ్వీసాగర్, ఎంఇఒలు మల్లారెడ్డి, హరికృష్ణ, జెఇ సుధాకర్, పంచాయతీ సెక్రటరీ వెంకటేశులు, వెల్ఫేర్ అధికారి దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎసి రాముడు ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బుసగాని నాగేశ్వరరావు, ఎంపిటిసి శంకర్‌యాదవ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉమాదేవి, సీనియర్ అసిస్టెంట్ నూరు మొహమ్మద్, జూనియర్ అసిస్టెంట్ నరేంద్ర, టైపిస్ట్ ఆనంద్, అటెండర్ మోహన్, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మానవాళి మనుగడకు చెట్టు రక్షణ అని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిణి వైఖోమ్ నిదియాదేవి అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటారు. అనంతరం అధికారులు, నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, ఎంపిడిఒ ఎం.శోభారాణి, ఇఒఆర్‌డి దామోదరమ్మ, ఎపిఒ పోలేరయ్య, ఎఒ శ్యామ్‌సుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రంలో మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు



అనంతపురంలో ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న వైద్యసిబ్బంది

కుష్టువ్యాధి నివారణకు చర్యలు

వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

కుష్టు వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని డాక్టర్ అనుపమ జేమ్స్ సూచించారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటికీ వెళ్లి కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వేను వినాయక నగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ పరిధిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అనుపమ జేమ్స్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతిఇంటినీ ఏఎన్ఎం, వాలంటీర్లు సందర్శించి చాలన్నారు. చర్మంపై స్పర్శ, జ్ఞానం లేని, నొప్పి, దురద, మచ్చలు, చర్మంపై ఎర్రని, రాగి రంగు మచ్చలు, చేతులు, పాదాలు తిమ్మిర్లు, కనుబొమ్మ, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం వంటి లక్షణాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు గంగాధర్‌రెడ్డి, సుస్మిత, పిఎంఒ నాగన్న, హెచ్ఇఒ సత్యనారాయణ ,ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

శింగనమల : కుష్టువ్యాధిని గుర్తించేందుకు మండల వ్యాప్తంగా ఇంటింటి సర్వే చేపట్టినట్లు డాక్టర్ తేజస్విని తెలిపారు. గురువారం మండల పరిధిలోని చిన్న మట్లగొంది వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివిధ రకాల మచ్చలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతిఇంట్లో వికలాంతత్వం రాకుండా చేసేందుకే ఇంటింటా సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి కలిసి ఆగస్టు 2వతేదీ వరకూ ఇంటింటికీ వెళ్లి స్పర్శలేని మచ్చలు, కనురెప్పలు బొమ్మలపై వెంట్రుకలు రాలిపోవడం, చేతులు వంటి లక్షణాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి మౌనిక, ఏఎన్ఎం పద్మావతి, ఆశాకార్యకర్తలు సంధ్యారాణి, అంగన్వాడీ కార్యకర్త మునిలక్ష్మి, హెల్పర్ లక్ష్మీదేవి, ప్రజలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా గురువారం మండల పరిధిలోని కాలువపల్లి హెల్త్ క్లినిక్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ఈనెల 18 నుంచి వచ్చేనెల 6వతేదీ వరకూ లెప్రసి కేసు డిటెక్షన్ క్యాంప గైన్ కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ విజయ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, పిహెచ్ఎన్ సరోజ, హెల్త్ అసిస్టెంట్ రవీంద్ర, ఈశ్వరమ్మ, స్వాతి, సుభాన్, ఎర్రమ్మ, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



శింగనమల మండలంలో సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది